క్లుప్తంగా

దత్తాత్రేయుడికి విశేష పూజలు



శ్రీశైలం టెంపుల్: ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామివారికి గురువారం దేవస్థానం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజను జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు పూర్తి చేశారు.

ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు



కౌలు రైతులు ఉండే అర్జీ స్వీకరిస్తున్న ఏఓ పవన్ కుమార్

బండి ఆత్మకూరు: అర్హులైన ప్రతి కౌలు రైతులకు గుర్తింపు కార్డు అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి ఆర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం పెద్దదేవులపురం గ్రామం రైతు సేవ కేంద్రాన్ని పరిశీలించారు. కౌలు రైతుల నుంచి కౌలు కార్డు కోసం దరఖాస్తులు స్వీకరించారు. కౌలు కార్డుతో ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని రైతులు ఇంటే త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి సుహాసిని, సర్పంచ్ పెద్దన్న పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: ఈనెల 21న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 15,000 మంది యోగాంధ్ర కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వారందరినీ కార్యక్రమానికి తీసుకురావాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. అనంతర హాస్టల్‌ను పరిశీలించారు. భోజనం నాణ్యతగా ఉంటుందా అంటూ విద్యార్థులను ఆరా తీశారు. మెనూ పట్ల నిర్లక్ష్యం వహించొద్దని వంట నిర్వాహకులకు సూచించారు. హాస్టల్‌లో వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ నాగరవీంద్ర ఉన్నారు.

నేరాల జోలికెళ్లొద్దు



వాహనాలను స్వాధీనం చేసుకున్న సీఐ రాము

ఆత్మకూరు: నేరాల జోలికెళ్లొద్దని సీఐ రాము ప్రజలకు సూచించారు. గురువారం పట్టణంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. ప్రజలు గొడవల జోలికి ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలన్నారు. అంతకముందు వెంగళరెడ్డినగర్, కరివేన గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి 30 మోటార్ సైకిళ్లు, 15 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని యువకులను మందలించారు. సరైన ధ్రువపత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు.

అనీమియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

ఆత్మకూరు: అనీమియా వ్యాధిపై అమలాపురం గ్రామంలో బైర్లూటీ వైద్యాధికారి పవన్ కుమార్ గురువారం అవగాహన కల్పించారు. ఇది జన్యుపరమైన వ్యాధి అన్నారు. ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రసక్తే లేదన్నారు. వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చన్నారు.

ముందుకు సాగని ఖరీఫ్

- ముందస్తు వర్షాలకు విత్తు వేసిన రైతులు
- ముఖం చాటేసిన వరుణుడు
- ఆందోళనలో అన్నదాతలు

ఖరీఫ్ ముందుకు సాగడం లేదు. ముందస్తు వర్షాలు ఊరించడంతో ఆగమేఘాల మీద విత్తనం వేసిన అన్నదాతలకు.. ఇప్పుడు పైర్లను కాపాడుకోవడం గగనమైపోయింది. విత్తు పడినప్పటి నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతల ఆశలు ఆవిరైపోతున్నాయి. ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఇప్పటికే 30 శాతానికి పైగా రైతులు పొలాల్లో విత్తు వేశారు. దాదాపు రెండు వారాలైనా చినుకు జాడ లేదు. రోజూ ఉదయం మేఘాలు ఊరించి సాయంత్రానికంతా ఉసూరుమనిపిస్తుండటంతో రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

–ఆత్మకూరు

ఆత్మకూరు డివిజన్ పరిధిలో దాదాపు 27 వేలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, కంది, సోయాబీన్, మెట్ట వరి పంటలను రైతులు సాగుచేస్తారు. ప్రస్తుతం మే నెలలో కురిసిన వర్షాలకు రైతన్నలు 30 శాతానికి పైగా పంటలను సాగుచేశారు. కాగా ఈనెలలో కేవలం 19 మి.మీ. వర్షం కురవడంతో పైర్లు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. మరోవైపు ఇంకా 70 శాతానికి పైగా పొలాలు విత్తు కోసం సిద్ధంగా ఉన్నాయి. ఈ దశలో వరుణుడు కనుమరుగు కావడంతో వేసిన పంటలను ఎలా రక్షించుకోవాలని కొందరు.. మిగిలిన పొలాల్లో ఇంకెప్పుడు విత్తనం వేయాలని మరికొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు.



రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట

విత్తనం వేశాం



ముందస్తు వర్షాలను నమ్ముకుని మూడు ఎకరాల్లో మొక్కజొన్న, మరో మూడు ఎకరాల్లో పత్తి విత్తనం వేశాం. విత్తనం వేసినప్పటి నుంచి వానలు పడలేదు. మరో వారం రోజుల్లో వాన రాకపోతే పైర్లు పూర్తిగా ఎండిపోతాయి.

– వెంకటేశ్వర్లు, రైతు, ఆత్మకూరు

వాన కోసం ఎదురు చూస్తున్నాం



నాకు పది ఎకరాల పొలం ఉంది. దుక్కి దున్ని ఎరువు చల్లి సిద్ధం చేసి వానం కోసం ఎదురు చూస్తున్నాం. దాదాపు పదిహేను రోజులైంది వాన చుక్కే లేదు. అదునుదాటితే విత్తినా లాభం ఉండదు.

– విజయ్, రైతు, ఆత్మకూరు

రైతుల సమస్యను పరిష్కరిస్తాం

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్‌లో రీ సర్వేలో భాగంగా నమోదైన జాయింట్ ఎల్‌పీఎంఎస్ వల్ల కొంతమంది రైతులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని, వారి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆర్డీఓ నాగజ్యోతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల రైతులకు జాయింట్ ఎల్‌పీఎంఎస్‌ను స్ప్లిటింగ్ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. రైతులు గ్రామ సర్వేయర్‌ను గానీ, వీఆర్వోను గానీ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌ను కానీ కలిసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

నందికొట్కూరు: ఈనెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య తెలిపారు. గురువారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

ప్రజా సమస్యల పోరాట వేదిక సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం కొనసాగిస్తూ ప్రజా పోరాటాల వేదికగా సీపీఐ కొనసాగుతుందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫకృద్దీన్, జిల్లా నాయకులు ఎం.రమేష్‌బాబు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి సోమన్న అన్నారు. గురువారం శ్రీపతిరావుపేటలో నూతన సీపీఐ శాఖ సమావేశం తాలూకా కార్యదర్శి ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీ కార్యదర్శిగా దాసును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శివనారాయణ, వెంకటశివుడు పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాములపాడు: చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న గురువారం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. పార్టీ మండల నాయకులు వెంకటేశ్వరరావు, రాజు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి

కొత్తపల్లి: ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో దళిత సర్పంచ్‌ను అవమానపరిచిన ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్ స్వాములు, నాయకులు యస్ సంజీవరాయుడు, పి ఏసన్న, జి దాసు, ఎన్ దాసు డిమాండ్ చేశారు. గురువారం సింగరాజుపల్లి గ్రామంలో వారు మాట్లాడారు. గ్రామంలోని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సభపై దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌కు చోటు ఇవ్వకుండా కిందనే నిలబెట్టడం తగదన్నారు.

- ఆత్మకూరు: ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, పట్టణ నాయకులు సురేంద్ర, వీరన్న, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం వారు స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ దళితులంటే ఎమ్మెల్యేకు చిన్నచూపు తగదన్నారు.

ఎజెండాను ఆమోదించండి

- ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: తమ కౌన్సిలర్లు ఇచ్చిన టేబుల్ ఎజెండాను ఆమోదించాలని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జైకిసాన్ పార్కులో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు రోడ్డు మార్కెట్ యార్డు నుంచి ఆత్మకూరు రోడ్డు జమ్మి చెట్టు వరకు డివైడర్ నిర్మాణం పూర్తి చేసి సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినా ఎందుకు పట్టించుకోవడం లేదని కమిషనర్‌పై మండిపడ్డారు. డివైడర్లు, లైట్లు వేయడం ఇష్టం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బేబి, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం



సున్నిపెంటలోని నాగేంద్రం ఇంట్లో పూసిన బ్రహ్మ కమలం

శ్రీశైలంప్రాజెక్ట్: ఏడాదికి ఒక సారి మాత్రమే పూసే పుష్పాల్లో ఒకటి బ్రహ్మకమలం. హిమాలయాలలో విరివిగా కనిపించే ఈ పుష్పం.. బ్రహ్మదేవునికి ప్రీతిపాత్రమని పురాణాలు చెబుతున్నాయి. దక్షిణ భారతంలోని భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అరుదుగా బ్రహ్మ కమలం పూస్తుంది. సున్నిపెంటలోని నాగేంద్రం ఇంట్లో గురువారం బ్రహ్మ కమలం వికసించింది. బ్రహ్మకమలాన్ని చూడడానికి ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు.

శ్రీశైలం ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) శ్రీశైలంలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎ.రవీంద్ర బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల కోర్సులు ఫిట్టర్, టర్నర్, మెకానిక్ మోటార్ వెహికల్, ఎలక్ట్రిషియన్ కోర్సులు, ఏడాది కోర్సులు మెకానికల్ డీజిల్, వెల్డర్‌లలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు www.iti.ap.gov.in ను సంప్రదించాలన్నారు. లేదా 9703395091, 9441181072, 9908993910 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తల్లికి వందనానికి దరఖాస్తు చేసుకోండి

బండి ఆత్మకూరు: తల్లికి వందనం పథకం డబ్బు పడని విద్యార్థుల తల్లులు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పద్మావతి గురువారం సూచించారు. పథకానికి అర్హత ఉన్నప్పటికీ బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ కానివారు లేదా ఆధార్, ఖాతా వివరాల్లో పొరపాట్లు ఉన్నవారు ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అటవీ సంపద సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్

శిరివెళ్ల: అటవీ సంపద సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ అనురాగమీనన్ అన్నారు. గురువారం పచ్చర్ల ఎకో టూరిజంలో అటవీ సిబ్బందికి అటవీ సంరక్షణపై రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1972లో వన్య ప్రాణుల సంరక్షణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. వన్య ప్రాణులను వేటాడినా, చంపినా ఏడేళ్ల జైలు, రూ.25 వేల జరిమానా ఉందన్నారు. నాగార్జున సాగర్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో వన్య మృగాల వేట నిషేధమన్నారు. వన్యప్రాణులు గ్రామాల్లోకి వచ్చినప్పుడు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పులులు, జింకలు, చిరుతలను కాపాడాలని సిబ్బందికి సూచించారు. 1967లోనే అటవీ సంపద రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. అభయారణ్యంలోకి ఎవరైనా చొరబడి చెట్లు నరకడం, తరలించడం చేస్తే శిక్షార్హులవుతారన్నారు. అనంతరం చెన్నైకి చెందిన వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో తిన్‌మోళి నేతృత్వంలో నిపుణులు వన్యప్రాణులు, అటవీ సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నంద్యాల, ఆత్మకూరు, మార్కాపురం డీఎఫ్ఓలు సాయిబాబా, సందీప్ కుమార్ గుండాలి, నాగమణేశ్వరి, ఎఫ్ఆర్ఓ ఉదయ్‌దీప్ పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజకుమారి, జేసీ

నంద్యాల: ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ టెక్కె మార్కెట్ యార్డులో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లతో యోగాంధ్ర సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ టెక్కె మార్కెట్ యార్డులో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి పెండింగ్ ఉన్న యోగా వేదికలను సాయంత్రం నాటికి పూర్తి చేయాలన్నారు. యోగ ప్రదేశాలకు ఉదయం 6.15 గంటలకు ప్రజలు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని క్లీన్ మైండ్.. క్లీన్ బాడీ అనే థీమ్‌తో నిర్వహిస్తామన్నారు.

ఆలయాల భూములు అన్యాక్రాంతమైతే సహించం



ఆలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

నందికొట్కూరు: ఆలయాల భూములు అన్యాక్రాంతం అయితే సహించేది లేదని విశ్వ హిందూ పరిషత్ జిల్లా నాయకులు వైవీ రామయ్య, భజరంగ్‌దళ్ జిల్లా నాయకులు నాగిరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో విగ్నేశ్వరస్వామి ఆలయం ఎదుట గ్రామ పెద్దలతో కలిసి వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొణిదెల గ్రామంలో 1976లో సర్వే నెంబరు 343/1లో 6.18 ఎకరాల భూమిని భక్తుడు గుంతాల వెంగయ్య విగ్నేశ్వరస్వామికి ఇచ్చారన్నారు. ఆ భూమిని దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు వేలం వేయడానికి గ్రామంలో మూడు సార్లు దండోరా వేయించారన్నారు. వేలం పాటలు జరపకుండా, ఎందుకు జరపరో గ్రామస్తులకు తెలియజేకుండా వాయిదా వేసి వెళ్లపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. గ్రామంలోనే కొందరు ఆ భూములను కాజేసేందుకు కుట్రపన్ని రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో వేలం పాటలు వాయిదా వేయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి భూములకు వేలం పాటలు నిర్వహించి ఆలయంలో దూపదీపనైవేద్యాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు కిశోర్‌కుమార్, నాగరాజు, వెంకటేష్, ఆవుల రెడ్డి, గ్రామ పెద్దలు చల్లా వెంకటరెడ్డి, లక్ష్మిరెడ్డి, సత్యంరెడ్డి, నాగరాజు, ఆంజనేయులు, సంజీవరెడ్డి, చిన్న శివన్న, ప్రతాప్ రెడ్డి, సతీష్‌రెడ్డి, సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విత్తన శుద్ధితోనే తెగుళ్ల నివారణ



అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వాతి

వెలుగోడు: ఏ పంటయినా సరే విత్తన శుద్ధితోనే కొన్ని రకాల తెగుళ్లను మొదట్లోనే నివారించవచ్చని ఏఓ స్వాతి తెలిపారు. గురువారం వేల్పనూరు, రేగడగూడూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలను శుద్ధి చేయకుండా సాగు చేసుకుంటే పంట ఎదుగుదల ఉండదని, దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. విత్తనం ద్వారా సోకే రసం పీల్చే పురుగులను శుద్ధి చేయడం ద్వారానే అదుపు చేసుకోవచ్చన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో భూములు సారవంతం

పాములపాడు: సేంద్రియ వ్యవసాయంతో భూములు సారవంతమవుతాయని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం జూటూరు, తుమ్మలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పత్తి, మిరప, మొక్కజొన్న పంటల సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం వర్తింపు కోసం ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. మండలానికి 40 క్వింటాళ్ల జీలుగలు మంజూరయ్యాయని, 50 శాతం సబ్సిడీతో అందజేస్తామని, కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

భక్తులు లేక మహానంది వెలవెల



ఖాళీగా ఉన్న మహానంది చిన్న కోనేరు

మహానంది: వేసవి సెలవులు ముగియడంతో మహానంది ఆలయ ప్రాంగణాలు భక్తులు లేక వెలవెలబోతున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో మహానంది ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. వచ్చిన కొద్దిపాటి మంది భక్తులు కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కొత్తపల్లి: అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లులేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలని, రేషన్ కార్డులు, పెన్షన్, గృహాలు, విద్య, వైద్యం తదితర సదుపాయాలు కల్పించాలనే డిమాండ్‌తో వచ్చేనెల 10న కొత్తపల్లి మండల మహాసభ జరుగుతుందన్నారు. పెద్దఎత్తున హాజరై మహాసభను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రమేష్ బాబు, సీనియర్ నాయకులు సంజీవులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఆత్మకూరు పట్టణ కార్యదర్శి ప్రతాప్, కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకటశివుడు, మహిళా సమైక్య నాయకులు మున్నుజాబి పాల్గొన్నారు.

అన్న ప్రసాదానికి రూ.1.5 లక్ష విరాళం



దాతని సత్కరిస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు గురువారం హైదరాబాద్‌కు చెందిన కె.సీతాకుమారి రూ.1,50,000 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. దాతకు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాసులు (47) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దకొట్టాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకుంటున్నా ఆరోగ్యం కుదుటపడటం లేదని గురువారం తన స్వగృహంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మాధవరం.. బురదమయం

- ఇళ్లలోని నీరంతా రోడ్డుపైనే నిల్వ
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు
- గ్రామంలో అస్తవ్యస్తంగా పారిశుధ్య వ్యవస్థ
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు






మాధవరం గ్రామంలో వీధిరోడ్లపై నిలిచిన మురుగునీరు

వెలుగోడు: ఇళ్లలోని మురుగు నీరు వెళ్లేందుకు మురుగు కాలువ లేక రోడ్లపైకి చేరుతుండటంతో మండల పరిధిలోని మాధవరం వీధులు బురదమయంగా మారాయి. పట్టించుకోవాల్సిన అధికారులు కనీసం గ్రామం వైపు కన్నెత్తి చూడకపోవడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగు కుంటలను తలపిస్తున్న వీధి రోడ్లపై దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. మురుగు నీరు వెళ్లేందుకు ప్రధాన రోడ్డుపై కల్వర్టును ఏర్పాటు చేయకపోవడంతోనే ఇళ్ల మధ్య నిలిచి అపరిశుభ్రత నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు జారి పడిపోతుండగా, వాహనాలు కూడా అదుపు తప్పి



ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మురుగు కాలువలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఇళ్లలోని నీటిని రోడ్డుపైకి వదిలేవారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీటిని వదిలేవారికి జరిమానా విధించాలని ఆయన కోరారు.

సైడ్ కాల్వలు ఏర్పాటు చేయాలి



మురుగు నీరు రోడ్డుపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. ప్రజలు కూడా మురుగునీరు రోడ్డుపైకి వదులుతున్నారు. ప్రశ్నిస్తే గొడవలవుతాయని ఊరుకుంటున్నాం. అధికారులే సమస్యను పరిష్కరించాలి.

– శాంతుడు, మాధవరం గ్రామస్తుడు